క్లుప్తంగా

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువత గురువారం మాజీ మంత్రి, కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావును కలిసి తమ మద్దతు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. జూపల్లిని కలిసిన వారిలో కుమార్, పరమేష్, శ్రీనివాసులు, కుర్మయ్య, గోపి, సురేష్, అలేవేందర్ ఉన్నారు.

వర్గీకరణ చేపట్టే వరకు పోరాటం



ఆత్మకూర్: మండలంలోని మేడేపల్లిలో గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశమై గ్రామ కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్ తెలిపారు. అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా మేస్త్రీ శ్రీను తోపాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. మందకృష్ణ మాదిగ తలపెట్టిన రథయాత్రకు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అజ్జపాగ మాసన్న, జానకీరాం, సోంబాబు, దండు శ్రీను, రేవల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రం వద్ద జనం బారులు



పాన్‌గల్: ఆధార్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, నూతన కార్డులు పొందడం, ఫోన్ నెంబర్లు లింకు చేసుకునేందుకు గురువారం మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రం వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన జనం పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ప్రతి అంశానికి ఆధార్‌కార్డు ప్రమాణికం కావడంతో కార్డులో ఏమైన తప్పులు ఉంటే ఇబ్బందులు వస్తుండడంతో వాటిని సరిచేసుకునేందుకు జనం ఎగబడుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, సర్వర్ పని చేయకపోవడం వంటి సమస్యలతో కేంద్రాల వద్ద గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.

నేటి నుంచి గ్యార్మీ ఉత్సవాలు



అమరచింత: ముస్లిం క్యాలెండర్ ప్రకారం శుక్రవారం నుంచి గ్యార్మి నెల ప్రారంభం కావడంతో మహబూబ్ ఉస్సేని ఉత్సవాలు నెల రోజుల పాటు కొనసాగనున్నాయి. పట్టణంలోని మహబూబ్ ఉస్సేని దర్గా వద్ద గ్యార్మి ఉత్సవాలు గురువారం గంధోత్సవంతో మొదలయ్యాయి. మూడు రోజుల పాటు మహబూబ్ ఉస్సేని దర్గాలో ఉర్సు జరుగుతుందని నిర్వాహకులు జిలాని తెలిపారు. దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా వసతులను కల్పించామన్నారు.

దళితుల నిరసన

గోపాల్‌పేట: వనపర్తి జిల్లా కేంద్రంలో గురువారం సీఎం కేసీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో గోపాల్‌పేట రాంనగర్ కాలనీకి చెందిన దళితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అర్హులైన వారికి కాకుండా అనర్హులకు దళితబంధు పథకం మంజూరు చేశారని తెలిపారు. గత రెండు ఎన్నికల్లో కేసీఆర్ పార్టీకి ఓటు వేశామని, అయినప్పటికీ తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తిలో కేసీఆర్ మీటింగ్ ఉన్నందున రావాలని బుధవారం రాత్రి పార్టీ నాయకులు కోరగా.. ముందుగా దళితబంధు పథకంలో న్యాయం చేయాలని స్పష్టం చేసినట్లు తెలిపారు. దళితబంధు కోసం ధర్నా చేస్తే 10 మందిపై కేసులు నమోదు చేశారని, అక్రమ కేసులను ఎత్తివేయడంతో పాటు అర్హులకు దళిత బంధు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెపుతామని స్పష్టం చేశారు.



అమరుల త్యాగాలు మరువలేనివి



ఆత్మకూర్ కలశాలతో మట్టి సేకరిస్తున్న అధికారులు, నెహ్రూ యువజన కేంద్రం సభ్యులు

ఆత్మకూర్: ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మేరాదేశ్ మేరా మట్టి కార్యక్రమంలో భాగంగా మట్టి సేకరిస్తున్నామని నెహ్రూ యువజన కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కోట్యానాయక్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. 74 మండల కేంద్రాల్లో మట్టిని సేకరించి ఈ నెల 27న గవర్నర్ తమిళిసై సమక్షంలో ప్రదర్శించి స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపకంగా నిర్మించే స్మారక స్తూపానికి ఈ మట్టిని వినియోగించనున్నట్లు తెలిపారు. నిర్వాహకులు రాజేష్, అనీల్, రాజేందర్‌గౌడ్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, కళాజాతా బృందం సభ్యులు ఉన్నారు.

పాన్‌గల్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మేరా దేశ్–మేరా మట్టి కార్యక్రమాన్ని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సమక్షంలో నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి గిరిజనులు, ఇతరులు మట్టిని కలశాల్లో తెచ్చి యువజన కేంద్ర సభ్యులకు అందజేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి 74 కేంద్రాల్లో ఈ మట్టి కలశాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ కోట్యానాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రం నుంచి సేకరించిన మట్టిని ఈనెల 27న గవర్నర్ తమిళిసై సమక్షంలో ప్రదర్శించి, దేశం కోసం అసువులు బాసిన స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపికగా ఉద్యానవనాన్ని నిర్మించేందుకు ఉపయోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వరమ్మ, నెహ్రూ యువక కేంద్రం సభ్యులు అనిల్‌కుమార్, అరవింద్, రాజశేఖర్, ఉపేందర్, అభి, మహేష్, సూరజ్ పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: ఆజాద్‌కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తకోట మండల పరిషత్ కార్యాలయంలో నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో 'మేరీ మట్టి–మేరీ దేశ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కార్యాలయాల ఉద్యోగులు మట్టిని కలశాలలో తెచ్చి యువజన కేంద్రం సభ్యులకు అందజేవారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, నెహ్రూ యువజన కేంద్రం సభ్యులు అరవింద్, రాజశేఖర్ పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో..



కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయంలో..

విద్యార్థులకు అల్పాహారం అందజేత



మనిగిల్లలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న అధికారి యుగంధర్, హెచ్‌ఎం శంకర్‌గౌడ్



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: పట్టణంలోని వడ్డేగేరి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు. దసరా సెలవుల అనంతరం గురువారం నుంచి విద్యార్థులకు ప్రతి నిత్యం అల్పాహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం మద్దిలేటి, మండల నోడల్ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, జీహెచ్‌ఎంలు కొండాపురం బాల్‌రాజు, అనంతరాములు, దోమ శ్రీను, రియాజుద్దీన్, సీఆర్పీ సౌమ్యరాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొత్తకోట రూరల్: రాష్ట్రంలో పాఠశాల విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని పెద్దమందడి మండలంలోని మనిగిల్ల జెడ్పీహెచ్‌లో జిల్లా సెక్టోరియల్ అధికారి యుగంధర్, హెచ్‌ఎం శంకర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రకాల టిఫిన్స్ అందజేస్తామని, ఈ పథకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకునేందుకు పాఠశాల పని దినాల్లో ఉదయం 8గంటల 30నిమిషాలకు చేరుకోవాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం నాణ్యవంతంగా అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా బడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం జ్యోతి, పెద్దమందడి కాంప్లెక్స్ సీఆర్పీ లావణ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లుగౌడ్, నాగేశ్వరమ్మ, విష్ణువర్దన్, సురేంద్రనాథ్, చంద్రకళ, విజయ్‌కుమార్, బాలాజీ, సురేఖ, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

నవంబర్ 14 నుంచి బొడ్రాయి ఉత్సవాలు



సమావేశంలో పాల్గొన్న బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు

అమరచింత: పట్టణంలో నవంబర్ 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు బొడ్రాయి ఉత్సవాలు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం భక్త మార్కండేయ ఆలయంలో ఉత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి బీచుపల్లికి చెందిన భువన శంకరాచార్యులు, శ్రీకృష్ణప్రసాద్ హాజరై ఉత్సవాల గురించి చర్చించారు. ఆంజనేయస్వామి ఆలయం ఎదుట యాగశాల ఏర్పాటుకు స్థలం పరిశీలించారు. 14న గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభిస్తూ.. 15 న బొడ్రాళ్ల ఊరేగింపు, 16న బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి పట్టణ ప్రజలు విరాళాల రూపంలో నగదును ఉత్సవ కమిటీకి అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొట్టం విష్ణువర్ధన్, తాటికొండ రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం మహబూబ్ స్వామి దర్గాలో భక్తులు గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శేఖర్, రవి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



కొత్తకోట రూరల్: దసరా పండుగ పురస్కరించుకుని మండలంలోని కానాయపల్లిలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. మూడు రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో 7 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో ఫ్రెండ్స్ లెవెన్, వివేకానంద టీంలు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఫ్రెండ్స్ లెవెన్ టీం విజేతగా, వివేకానంద టీం రన్నర్‌గా నిలిచాయి. మొదటి బహుమతి కింద వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు రూ.5వేల నగదుతో పాటు కప్‌ను అందజేశారు. అదేవిధంగా రెండో బహుమతిగా సిద్ధయ్య సహకారంతో రూ.3వేలు నగదు అందజేశారు. మూడు రోజులు పోటీలు నిర్వహించేందుకు సహాయ సహకారం అందించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్న నాయుడికి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత

పెబ్బేరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ రక్షిత కె.మూర్తి ఆదేశాల మేరకు చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.73,200 నగదు, 12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా గోపాల్‌పేట మండలం బుద్దారం గండి వద్ద ఓ వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా రూ.73,200 నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పెబ్బేరు మండలంలో 12 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు.

అడవి పందులను చంపొద్దు

కోడేరు: మండలంలోని ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ పొలాల వద్ద అడవి పందులను చంపేందుకు విద్యుత్‌షాక్ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఈ ఓమేశ్‌గౌడ్ హెచ్చరించారు. రాత్రి వేళలో విద్యుత్ షాక్ పెట్టడం వల్ల పాడి పశువులు, ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.

అలవి వలలతో వేట షురూ..

- కృష్ణానది పరివాహక ప్రాంతంలో యథేచ్ఛగా వేట
- వేగంగా తరిగిపోతున్న మత్స్యసంపద



అలివి వలలతో వేట కొనసాగించి ఎండబెట్టిన చిన్న చేపలు



వేటకు సిద్ధంగా అలవి వలలు

చిన్నంబావి: కృష్ణానదిలో మత్స్య సంపదను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. నిషేధిత అలవి వలలో చేపల వేట సాగిస్తున్నారు. ఇతర ప్రాంతాల వలస జాలరులు కృష్ణానది తీర ప్రాంతాల్లో మకాం వేసి మత్స్య సంపదను ఊడ్చేస్తున్నారు. అధికారుల నిఘా లేకపోవడంతో కృష్ణానది తీరం వారికి కనక వర్షం కురిపిస్తోంది. అధికారులు దాడులు చేసినా నిషేధిత అలవి వలతో చేపల వేట మాత్రం ఆగడం లేదు. కృష్ణానది తీరం విశాలంగా గట్టు ప్రాంతంగా ఉండటంతో అలవి వినియోగానికి అనువుగా మారింది.

మండలంలో ఇలా..

చెల్లెపాడు, కాలురు, వెల్టూరు, చిన్నమారు, పెద్దమారు, గూడెం గ్రామాల్లో యథేచ్ఛగా అలవి వలలతో చేపల వేట సాగిస్తున్నారు. ఇటీవలే కృష్ణానది పరివాహక ప్రాంతంలో పోలీసులు చేసిన దాడుల్లో మండలంలోని కాలురు గ్రామం వద్ద అలవి వలల వేట వెలుగు చూసింది. సన్నని దోమ తెర రంధ్రాల రూపంలో ఉండే వలను చేపల వేటకు వినియోగిస్తున్నారు. ఈ అలవి వలలతో చేపల వేట చేయటం ద్వారా నదుల్లోని చేప గుడ్లు, చిన్న చేపలు బయటకి వస్తాయి. దీంతో నదుల్లో మత్స్యసంపద తరిగిపోతుంది. కిలో బరువు కన్నా తక్కువ ఉన్న చేపలను సైతం పట్టుకోకూడదు. కానీ అలవి వలల వినియోగంతో గుడ్డు దశ నుంచి ఉన్న చేపలు కూడా బయటకి వస్తాయి.

చిక్కరు.. దొరకరు

అలవి వలలతో చేపల వేట సాగించే వారు చిక్కరు దొరకరనే విధంగా మారింది. నది ఒడ్డున నివాసాలు ఏర్పాటు చేసుకొని చేపల వేట కొనసాగిస్తున్నారు. అధికారులు దాడులు చేసే క్రమంలో వారి వద్ద ఉండే మరబోట్లు, పుట్టీల సహాయంతో అవతలి ఒడ్డుకు వెళ్లి సునాయసంగా తప్పించుకుంటున్నారు. అధికారులు నది అవతలి ఒడ్డుకు చేరుకునే లోపు వారు అలంపూర్, గొందిమల్ల ప్రాంతానికి వెళ్తున్నారు. ఇలా అధికారులు దాడులు చేయడం వారు తప్పించుకోవడం పరిపాటిగా జరుగుతోంది. ఒకరిద్దరు మాత్రమే అధికారులు దాడులు చేసే క్రమంలో పట్టుబడుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

కృష్ణానదిలో అలవి వలలతో చేపల వేట కొనసాగిస్తున్నారనే సమాచారం తమకు కూడా వచ్చింది. ఇటీవల స్థానిక పోలీసులు జరిపిన దాడుల్లో అలవి వలల సహాయంలో వేట సాగిస్తున్న ఆంధ్ర జాలర్లను పట్టుకున్నాం. నిషేధిత అలవి వలలతో వేట సాగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రెహ్మాన్, ఏడీ, మత్స్యశాఖ

కార్మికుల మేనిఫెస్టో ప్రకటించాలి



మాట్లాడుతున్న ఆర్‌ఎన్ రమేష్

అమరచింత: రాజకీయ పార్టీలు కార్మికుల మేనిఫెస్టోలను ప్రకటించాలని సీఐటీయూ జిల్లా సహ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో గురువారం సీఐటీయూ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ఏర్పడినప్పటికీ వివిధ రాజకీయ పార్టీలు వాళ్ల మేనిఫెస్టోలో కార్మికుల సంబంధించిన అంశాలు లేవన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీలు కార్మికులను మోసగిస్తూనే ఉన్నాయని, మరోమారు కార్మిక వర్గం మోసపోకుండా వాళ్ల హక్కులను కాపాడే పార్టీలను ఎన్నుకోవాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నర్సింహ, వెంకటేష్, ప్రభాకర్, నాగేంద్రమ్మ, ఆసిరెడ్డి, రవి, శ్యామ్‌సోన్, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు తప్పనిసరి



కదిరెపాడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాంబాయి



అమరచింత జెడ్పీఉన్నత పాఠశాలలో..

అమరచింత: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఆగమేఘాలుగా ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజ విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. గదుల కిటికీలకు జాలి బిగించే పనులు చేపడుతున్నారు. ఓటర్లతో పాటు సిబ్బందికి పోలింగ్ కేంద్రాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో వసతుల కల్పన చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రాంబాయి అన్నారు. గురువారం కదిరెపాడులోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నీచర్, ర్యాంప్‌లు తదితర వసతులు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ చక్రపాణి, ఆర్‌ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకులకు బుద్ధి చెప్పండి



ఆత్మకూర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూర్: రాష్ట్రంలో రైతులు బాగుపడుతుంటే కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, విండో అధ్యక్షులు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల మేలు కోసం ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడానే. రైతుబంధు, రైతుబీమా, పంటలకు గిట్టుబాటు ధర, రుణమాఫీ, 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తూ రైతులకు బాసటగా నిలుస్తున్నారన్నారు.

అమరచింత: రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న బీఆర్ఎస్ పార్టీపై విష ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, దళిత బంధు పథకాలను నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడం ఎంత వరకు సమంజసం ప్రశ్నించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్‌సింగ్ ఇంట్లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, రమేష్ ముదిరాజ్, నరసింహులు గౌడ్, చుక్క ఆశిరెడ్డి, నాగభూషణం గౌడ్, వెంకటయ్య, షానవాజ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాటవెల్లిలో..

కొత్తకోట రూరల్: రైతులకు పెట్టుబడి సాయం కింద ఇచ్చే రైతుబంధును ఎన్నికల సందర్భంగా నగదును రైతుల ఖాతాల్లో జమచేయొద్దంటూ కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు మండలంలోని కనిమెట్టలో ఎంపీపీ గుంత మౌనిక ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులతో కలిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, పరమేష్, కోటేశ్వర్‌రెడ్డి, రాంచంద్రయ్య, మన్యంకొండ, బాలన్న, రమేష్, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, బాలరాజు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నాటవెల్లిలో..

మండలంలోని నాటవెల్లిలో సర్పంచ్ ఎద్దుల లావణ్య, మాజీ సర్పంచ్ నాగేష్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



దుప్పల్లిలో గిరిజన సంప్రదాయ వేషధారణలో ఆల మంజుల

ఆత్మకూర్: కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కూరగాయల వ్యాపారి తోట రవి ప్రచారం చేపడుతున్నాడు. గురువారం తన కురగయాల దుకాణం వద్ద వినియోగదారులకు బీఆర్ఎస్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రతిరోజు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజన సంప్రదాయ వస్త్రాల్లో ఆల సతీమణి

మదనాపురం: మండలంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి ఆల మంజుల గురువారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దుప్పల్లితండా, పెద్ద తండా, నర్సింగాపురంతండా, రామన్‌పాడు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ప్రతి ఇంటికి వెళ్లి కేసీఆర్ చేపడుతున్న పథకాలతో పాటు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి వివరిస్తూ ముందుకు కదిలారు. దుప్పల్లిలో గిరిజన మహిళలు వారి సంప్రదాయ వస్త్రాలు ధరింపజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, బీఆర్ఎస్ నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు జయంతమ్మ, సర్పంచ్ శ్రావణి, మండల అధ్యక్షురాలు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన జనం

ఖిల్లాఘనపురం: వనపర్తిలో నిర్వహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు మండలం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య కార్యకర్తలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

గోపాల్‌పేట: జిల్లా కేంద్రంలో నిర్వహించిన కేసీఆర్ బహిరంగ సభకు గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లాయి.

పెబ్బేరు రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉమ్మడి పెబ్బేరు మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా తరలివెళ్లారు.